క్లుప్తంగా

గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడిగా శ్రీకాంత్



గ్రామీణ యువజన మందిరం కార్యవర్గం

మునగపాక: గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడిగా ఆడారి శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఆదివారం మందిర నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సూరిశెట్టి రాము, పెంటకోట సీతారామ్, ముఖ్య సలహా దారునిగా ఆడారి గంగమహేష్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మళ్ల జోగారావు, మళ్ల రామజగన్నాథం, క్రీడా విభాగం అధ్యక్షుడిగా పెంటకోట విజయ్, కార్యదర్శిగా ఆడారి సూర్య చంద్రరావు, కోశాధికారిగా ఆడారి లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా ఆడారి అరుణ్‌కుమార్, డైరెక్టర్లుగా బుద్ద నాగు, కాండ్రేగు చైతన్య, విల్లూరి సోమునాయుడు, టిక్కలి అప్పలనాయుడు, పెంటకోట శివగణేష్, షేక్ నాగూర్, కేవీఎస్ అప్పారావు ఎన్నికయ్యారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం



వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాంబాబు

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయంలో పలువురు భాగస్వాములు అవుతున్నారు. ఆదివారం మండలంలోని గంగాదేవిపేటకు చెందిన మొల్లేటి రాంబాబు రూ.20,005 నగదును కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సూరిశెట్టి రాము, పెంటకోట ఉమేష్, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి పరశురామ్, బొడ్డేడ రామునాయుడు, దాడి శ్రీరామమూర్తి, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



మాట్లాడుతున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య అందుతుందని ఎంఈవో బుద్ద శివనాయుడు తెలిపారు. మండలంలోని అరబుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు పని చేస్తుంటారన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో పిల్లలను ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పెద్దలు శరగడం యోగి నాగేశ్వరరావు, బొడ్డేడ గంగాధర్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఎవరైనా నిస్సహాయ స్థితిలో ఉంటే సహాయం చేసేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను గౌరవిస్తూ సన్మానించారు. సాయంత్రం వరకూ పూర్వ విద్యార్థులంతా ఆటల పోటీలతో సందడి చేశారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఈతమట్టలకు పుష్పాలు అలంకరించి సంకీర్తన చేస్తున్న క్రైస్తవులు

ఎస్.రాయవరం: మండలంలో పెదగుమ్ములూరు, అడ్డురోడ్డు ప్రాంతంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉన్న సెయింట్‌రీ సాలెమ్ బాప్టిస్ట్, హెచ్‌డీ స్మిత్ మెమోరియల్ బాప్టిస్ట్ ఎర్రుస్‌లేమ్ చర్చిల సంఘ కాపరులతో కలిసి సుమారు 300 మంది క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఏసు పాటలు పడుతూ సంకీర్తన చేశారు. చిన్నారులు, పెద్దలు ఈత మట్టలకు పుష్పాలు అలకంరించి ర్యాలీలో సందడి చేశారు.

ఐక్యత, క్రమశిక్షణ @ ఎన్‌సీసీ



అచ్యుతాపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

- ఎన్‌సీసీతో మెరికల్లా తయారవుతున్న విద్యార్థులు
- ప్రత్యేక కోటాతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు



అచ్యుతాపురం: ఐక్యంగా ఉంటే విపత్కర పరిస్థితులను సులభంగా ఎదుర్కోవచ్చు. క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో ఎన్‌సీసీ పేరిట ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. చదువులో రాణింపుతో పాటు క్రమశిక్షణకు దోహదపడుతోంది ఎన్‌సీసీ. గ్రామీణ ప్రాంత విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ విభాగం ఉపయోగపడుతోంది. ఒకప్పుడు జిల్లాలో ఒకటి, రెండు కళాశాలలకు పరిమితమైన ఎన్‌సీసీ విభాగం పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ విస్తరిస్తోంది. ధైర్య సాహసాలను అలవరుచుకోవడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, దేశ రక్షణలో మమేకం కావాలనే కల నెరవేర్చుకోవడంలో ఎన్‌సీసీ తోడ్పడుతుంది. ఆత్మ రక్షణకు అవసరమైన మెలకువల్ని సైతం అందిస్తుంది. విద్యార్థి దశలోనే అనేక లక్షణాలను అలవరుచుకోవడానికి ఎన్‌సీసీ విభాగం చేస్తున్న కృషి అనిర్వచనీయం. ఎన్‌సీసీ ధ్రువీకరణ పత్రంతో ఎంతో మంది ఉన్నత విద్యలో సీట్లు పొంది ఉద్యోగ అవకాశాలు సాధించారు. అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఆర్మీ, నేవీలలో శిక్షణ ఇస్తున్నారు. ఇలా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో పాల్గొని గుర్తింపు పొందారు. సైనిక వందనం, స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనడం, కవాతు, మొక్కలను నాటడం, రక్తదాన శిబిరాల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సాయం చేయడం వంటి అనేక కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు.

విద్యార్థులకు ఉన్నత భవిష్యత్

ఎన్‌సీసీతో విద్యార్థులు క్రమ శిక్షణతో పాటు ఉన్నత భవిష్యత్ పొందవచ్చు. ప్రస్తుతం విద్యార్థులు ఆత్మ రక్షణతో పాటు, దేశ రక్షణకు ఆకర్షితులవుతున్నారు. సామాజిక సేవలో మమేకం అవుతున్నారు. మంచి యూనివర్సిటీల్లో సీట్లు పొందడం, ఉద్యోగ అవకాశాలు పొందడం ఎన్‌సీసీ వల్లే సాధ్యమవుతోంది.

–శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రశాంతి కళాశాల

ఘనంగా ఉరుసు మహోత్సవం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో వెలసి ఉన్న హజరత్ అన్సర్ మద్‌ని ఔలియా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) ఆదివారం ఘనంగా ముగిసింది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ ఉత్సవానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిశా, టాటా నగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఔలియా సమాధిని భక్తిశ్రద్ధలతో దర్శించుకొని ప్రార్థనలు చేశారు. రాత్రి దర్గా ప్రాంగణంలో జాగరణ చేశారు. రాత్రి నాగపూర్, ముంబైకి చెందిన బృందాలతో నిర్వహించిన ఖవ్వాలి ఉర్దూ పాటల పోటీ అలరించింది. తీర్థ మహోత్సవంలో పిల్లలు, పెద్దలు ఆకాశ చక్రం, రంగుల రాట్నంపై సందడి చేశారు.



ఉరుసు ఉత్సవం నిర్వహిస్తున్న ముస్లింలు

వైభవంగా తలుపులమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం



నేలవేషాలు



కోలాట ప్రదర్శన

యలమంచిలి రూరల్: మండలంలోని షేకిళ్ల పాలెం శివారులో కొలువైన తలుపులమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొలిరోజు గణపతి హోమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.24 గంటలకు ఆలయ ప్రారంభోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా చిడతల భజనలు, నేలవేషాలు, కోలాట ప్రదర్శనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

నిరంతర్ సేవా ఫౌండేషన్ చైర్మన్ గణేష్‌కు పురస్కారం



అబ్దుల్ కలాం పురస్కారం అందుకుంటున్న గణేష్

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లికి చెందిన నిరంతర్ సేవా ఫౌండేషన్ చైర్మన్ కొమ్మోజు గణేష్ డాక్టర్ అబ్దుల్‌కలాం పురస్కారాన్ని అందుకున్నారు. గణేష్ ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. కోవిడ్ సమయంలో ఎంతో మందికి సేవలందించారు. దీనిలో భాగంగా చీరాలకు చెందిన ప్రముఖ సేవా సంస్థ కృతి ఫౌండేషన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా ఉమ్మడి రాష్ట్రాల్లో ఈ నెల 12న 40 మందికి అవార్డులు అందజేశారు. అబ్దుల్ కలాం పురస్కారాన్ని గణేష్ అందుకున్నారు. గణేష్ ప్రస్తుతం అనకాపల్లిలోని అపోలో ఫార్మసీలో ఉద్యోగం చేస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీరామరక్ష రథయాత్ర

మునగపాక: మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. అయోధ్య రామాలయంలో బాలరాముడిని ప్రతిష్ఠించి ఏడాది కావచ్చిన సందర్భంగా ఉమ్మలాడ, నాగులాపల్లి, ఒంపోలు, గంగాదేవిపేట, మునగపాక గ్రామాల్లో రథయాత్ర నిర్వహించారు. ఈ యాత్రను పొందూరు ఆనందాశ్రయ స్వామీజీ శ్రీనివాసానంద సరస్వతి, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 20 రోజుల పాటు రథయాత్ర జరుగుతుందన్నారు.



ఉమ్మలాడలో శ్రీరామరక్ష రథయాత్ర ప్రారంభిస్తున్న భక్తులు

ప్రజల్లో భక్తిభావాలను నింపేందుకు ఇటువంటి రథయాత్రలు దోహదం చేస్తాయన్నారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

గ్రామీణ యువజన మందిరం సేవలు మరింత విస్తృతం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: గ్రామీణ యువజన మందిరం సేవలను మరింత విస్తృతం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో ఆదివారం గ్రామీణ యువజన మందిరం వార్షిక సమావేశం సంఘం అధ్యక్షుడు ఆడారి గంగమహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మునగపాక ఖ్యాతిని ఇనుమడింపచేసిన ఘనత గ్రామీణ యువజన మందిరానికే దక్కుతుందన్నారు. ఎంతో మంది కళాకారులు తయారు కావడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి అందరి మన్ననలు అందుకుంటున్న యువజన మందిరం రానున్న రోజుల్లో మరిన్ని మంచి పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దాడి ముసిలినాయుడు, కర్రి సాయికృష్ణ, యువజన మందిరం గౌరవ అధ్యక్షుడు సూరిశెట్టి రాము, పెద్దలు వేగి సూర్యనారాయణ, పెంటకోట విజయ్, ఆడారి శేఖర్, దాడి జగన్నాథరావు, దాడి అప్పలనాయుడు, దాడి సాంబశివ, ఆడారి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌తో అనర్థాలపై వినతి



ఎంపీ రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న అచ్యుతాపురం ప్రజలు

అచ్యుతాపురం రూరల్: ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా స్థానిక ప్రజలకు కలిగే అనర్థాలపై అనకాపల్లి ఎంపీ రమేష్‌కు అచ్యుతాపురం గ్రామ ప్రజలు విన్నవించుకున్నారు. ఆదివారం అచ్యుతాపురంలో జరిగిన బీజేపీ నియోజకవర్గ క్రియాశీల సభ్యుల సమావేశానికి ఎంపీ హాజరయ్యారు. సమావేశం అనంతరం ఫ్లైఓవర్ వద్దు రింగు రోడ్డు ముద్దు అంటూ తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వేల వాహనాలు ఒకే రహదారిపై రాకపోకలు చేస్తే కూడలిని ఆనుకున్న గ్రామాలన్నీ పూర్తిగా కాలుష్యానికి గురవుతాయన్నారు. రింగ్ రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడికక్కడ ట్రాఫిక్ నియంత్రణ చేయడమే కాకుండా కాలుష్యాన్ని నివారించవచ్చునని వారు చెప్పారు. అనకాపల్లి బైపాస్ నుంచి ఎస్ఈజెడ్ ముఖ ద్వారం వరకూ ఒకే వెడల్పుతో విస్తరించాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మునగపాక: ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధు కోరారు. మండలంలోని నాగులాపల్లిలో జిల్లా దళిత విభాగం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మైలపల్లి పోతురాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం మధు మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. సర్పంచ్ జామి చినమ్మలు, దళిత నేతలు దూలం బూసిరాజు, కామరాజు, పల్లా బాబ్జీ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి,



చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు మధు

రాజాన బుజ్జిబాబు, రేవడి కృష్ణ, గోసాల గోవిందరాజు, కారు శాంతకుమార్, బీలా లక్ష్మణరావు,లంబా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే పోటీ పరీక్షల్లో రాణింపు

మునగపాక: విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణించాలని ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ భీమిశెట్టి ఉమాశంకర్ కోరారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్, అనకాపల్లికి చెందిన షిర్డీ సాయి లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలీసెట్ శిక్షణ తరగతులను ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత ఎంతో అవసరమన్నారు. సాంకేతిక రంగాల్లో రాణించేందుకు పాలీసెట్ దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఏవీఎస్ మూర్తి, పెంటకోట సత్యనారాయణ మూర్తి, మాడెం జోగారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉమాశంకర్‌ను ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్

గుడివాడలో 30 మంది రక్తదానం

ఎస్.రాయవరం: దేశ నాయకుల జయంతి, వర్ధంతి రోజున యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు అన్నారు.




శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

భారత్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గుడవాడలో యువకులు ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 30 మంది యువకులు రక్తదానం చేయగా, మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు, డీహెచ్‌పీఎస్ సభ్యులు పూడి చలం, పిల్లి రమణ, సత్యనారాయణ, జాన్ డేవిడ్, పిల్లి రాజు, పీతల పృధ్వీరాజు, నాగభూషన్, సుకుమార్, సురేష్, అరుణ్, రూపాసే, శశి, శివ, చందు, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఎన్టీఆర్ మైదానంలో కళాకారుల నృత్య ప్రదర్శన



ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు



అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు వద్ద వంటలు చేసుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత తాగునీరు, మజ్జిగ, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీనులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టివి.విజయకుమార్. ఎం.వెంకటనారాయణలు గట్టిపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, భగవత్‌గీత ఖ్యాతి ప్రవచనకర్తలు డాక్టర్ సంతోష్‌కుమార్, ఆమెగ్‌దేశ్‌పతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్టీఆర్ గ్రౌండ్‌లో ఆధ్యాత్మిక సమావేశం

అనకాపల్లి టౌన్: శాశ్వతమైన, అఖండమైన ధర్మమే సనాతన ధర్మమని భగవద్గీత ఫౌండేషన్ అధినేత గంగాధర్ శాస్త్రి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్‌లో గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఉత్సవాలలో భాగంగా సనాతన క్షాత్రం ఆధ్యాత్మిక సమావేశం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ మతం అంటే నిజాయితీ, సద్భావన, దయ, ఓపిక, ఇతరులను గౌరవించడమేనన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అతిథులు భగవద్గీత ఫౌండేషన్ అధినేత గంగాధర్ శాస్త్రి, రుగ్వేద అధ్యాపకుడు సంతోష్ కుమార్, ఆంధ్ర నాట్య కళాకారి టీఎస్ శుభ రాజేశ్వరీలను ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారికి కోళ్లను మొక్కుతున్న భక్తులు



అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

జిల్లా టాపర్‌గా నిలిచిన నవ్యశ్రీకి అభినందనలు

అచ్యుతాపురం రూరల్: మండలంలో దుప్పితూరు గ్రామానికి చెందిన కన్నం నవ్యశ్రీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 989/1000 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవడంతో ఆదివారం గ్రామస్తులు అభినందనలు తెలిపారు. విశాఖ జిల్లా శ్రీవిశ్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న నవ్యశ్రీ 2025 జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్‌లో 98.38 శాతం వచ్చాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



కన్నం నవ్యశ్రీ (989/1000)

తెలికుల కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: అఖిల గాండ్ల తెలికుల కులస్తులు సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా అఖిలగాండ్ల తెలికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకట్రావు అన్నారు. స్థానిక బాలాజీరావు సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం వివిధ మండల అధ్యక్ష, కార్యదర్శుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాఖను బలోపేతం చేయడం కోసం జిల్లాలోని అన్ని మండలాల్లో తెలుకుల కులస్తులను సమీకరించి సమర్థులైన వారిని ఎంపిక చేసి జిల్లా శాఖలోకి తీసుకుంటామన్నారు. జిల్లాలో దాదాపు 20 వేల మంది తెలికుల కులస్తులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది ఉన్నట్లు చెప్పారు. బీసీ కులాల్లో అత్యంత వెనుకబాటు తనంతో మగ్గిపోతున్న ఈ కులస్తులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో తమ కులస్తులకు ఒక కల్యాణ మండపానికి అవసరమైన స్థలం, నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మనాపల్లి సన్యాసిరావు, ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి వాసుదేవరావు, కోశాధికారి రాజపూడి కోటేశ్వరరావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఇంజరపు జ్ఞానేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండేపల్లి వెంకట్రావు

26న హనుమాన్ శోభాయాత్ర

అనకాపల్లి: పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి వరకూ ఈ నెల 26న హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, వైద్యుడు డి.డి.నాయుడు తెలిపారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి ఆలయంలో హనుమాన్ శోభాయాత్ర పోస్టర్, విశ్వహిందూ పరిషత్ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శోభాయాత్రలో అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ప్రాంత సత్సంగ్ ప్రముఖులు శ్రీకాశీహస్తి., డాక్టర్ దక్షిణామూర్తి, ఆర్ఎస్ఎస్ నగర సంఘం సంచాలకుడు విల్లూరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి అరవెల్లి ప్రదీప్, నగర ఉపాధ్యక్షుడు కొలపర్తి కన్నబాబు, జిల్లా కోశాధికారి ఆడారి రాజు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుష్పాంజలి సేవ

కశింకోట: స్థానిక పురాతన వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పుష్పాంజలి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. చైత్ర శుద్ధ ఏకాదశి రోజు స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిర్వహించిన పుష్పాంజలి సేవలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అందంగా మల్లె పూలు, సంపంగి, కనకకాంబరాలు, చామంతి, గులాబీ పూల మాలలతో అలంకరించారు. పాలు, వివిధ రకాల తీపి, కారం పిండి వంటలు, పండ్లు స్వామికి నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో ఈ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు.



పుష్పాంజలి సేవ అనంతరం స్వామికి నివేదించిన పిండి వంటలు, పండ్లు